# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 02-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి 3 రోజుల పాటు ఒడిశా రాష్ట్రంలో పర్యటించనున్నారు.
- ❖ మనదేశం "వికసిత్ భారత్"గా రూపుదిద్దుకుంటున్న తరుణంలో దేశ యువత శారీరకంగాను, మానసికంగాను ధృఢంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.
- ❖ స్వచ్ఛ భారత్, ఏక్ పేడ్ మా కే నామ్, హర్ ఘర్ తిరంగా వంటి జాతీయ కార్యక్రమాల పట్ల NCC నిబద్ధతతో పని చేస్తోందని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.
- ❖ భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఈరోజు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో `పీబీజీ సోల్జర్‌థాన్` ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి.. 'సైనికుల కోసం పరుగెత్తండి, సైనికులతో కలిసి పరుగెత్తండి' అనే దార్శనికతతో పౌరులకు, సాయుధ దళాలకు మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి ఈ సోల్జర్ థాన్ ఒక ప్రత్యేక వేదికగా ఉపయోగపడుతుందని సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. మిజోరం గవర్నర్ జనరల్ వి.కె. సింగ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా.. రాష్ట్రపతి రేపటి నుండి మూడు రోజుల పాటు ఒడిశాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆమె కటక్, భువనేశ్వర్, బ్రహ్మపూర్, గంజాం జిల్లాలలోని తప్తపాని ప్రాంతాలలో జరిగే పలు విద్యా, సాంస్కృతిక, అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారు. తొలిరోజున రాష్ట్రపతి కటక్‌లోని జగద్గురు కృపాలు విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం వికసిత్ భారత్ గా రూపుదిద్దుకుంటున్న తరుణంలో దేశ యువత శారీరకంగాను, మానసికంగాను ధృఢంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. న్యూఢిల్లీలో ఈరోజు `నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్

సంకల్ప్ అభియాన్` కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... యువత ఎల్లప్పుడూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం ప్రజలను వారి లక్ష్యాల నుండి దూరం చేసి, కలలను సాకారం కాకుండా అడ్డుకుంటుందని, కుటుంబాలను నాశనం చేయడమే కాక.. దేశాన్ని కూడా బలహీనపరుస్తుందని చెప్పారు. వీటి బారి నుండి యువతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వ్యసనాల చెడు ప్రభావాలను యువత తప్పక అర్థం చేసుకోవాలని సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించడానికి, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకెన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు ఆయనకు నివాళులర్పించారు. పింగళి వెంకయ్య గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, నిజమైన గాంధేయవాది అని రాధాకృష్ణన్ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడిని గర్వంతో ఏకం చేస్తున్న తరుణంలో... ఆయన నిస్వార్థ సేవ, వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ గౌరవంతో స్మరించుకోవాలని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పింగళి వెంకయ్యకు నివాళులు అర్పించి, జాతీయ పతాకం రూపకల్పన ద్వారా ఆయన దేశానికి నిస్వార్థమైన సేవలందించారని సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా ఆయనకు నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ద్వైపాక్షిక అంశాలపై భారతదేశ సహకారం కావాలంటే.. పాకిస్తాన్ ముందుగా తన దేశంలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయాలని అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా ఉద్ఘాటించారు. సింధు నదీ వ్యవస్థపై పాకిస్థాన్ డిమాండ్లు నెరవేర్చకపోతే భారత్‌పై యుద్ధం చేస్తామని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి బెదిరించడం సరికాదని క్వాత్రా విమర్శించారు. తన అంతర్గత సమస్యల నుండి దృష్టి మరల్చడానికి భారత్ పై యుద్ధం చేస్తామని బెదిరించడం పాకిస్థాన్‌కు సాధారణ విధానంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశాన్ని నిందించడం మానుకొని పాకిస్థాన్ తన నీటి ఉత్పాదకతను సరిదిద్దుకోవాలని వినయ్ మోహన్ క్వాత్రా సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్‌ల లోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బీహార్‌లోని బంకిపూర్, గుజరాత్‌లోని మంజల్‌పూర్, మధ్యప్రదేశ్ లోని దతియా నియోజకవర్గాలలో గత నెల 30వ తేదీన పోలింగ్ జరిగింది. రేపు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మూడు రాష్ట్రాలలోనూ లెక్కింపు సజావుగా జరిగేలా చూసేందుకు ఎన్నికల సంఘం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

79వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (NCC) ఈరోజు న్యూఢిల్లీలో సైక్లోథాన్-2026ను నిర్వహించింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, ప్రముఖ బాక్సర్ ఎం.సి. మేరీ కోమ్, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు లియాండర్ పేస్ ల సమక్షంలో ఈ సైక్లోథాన్ ప్రారంభమైంది. భారతదేశ స్వాతంత్ర్య 79వ వార్షికోత్సవాన్ని

పురస్కరించుకుని, 79 మంది NCC క్యాడెట్ల బృందం.. లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వాట్స్ నాయకత్వంలో 79 కిలోమీటర్ల సైకిల్ యాత్రను నిర్వహించింది. మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియం నుండి ప్రారంభమైన ఈ సైక్లోథాన్.. రాజధానిలోని ప్రముఖ ప్రదేశాల ద్వారా కొనసాగి అదే వేదికపై ముగిసింది. ఈ సైక్లోథాన్.. టీబీ ముక్త్ భారత్, స్వచ్ఛ భారత్, ఏక్ పేడ్ మా కే నామ్, హర్ ఘర్ తిరంగా వంటి జాతీయ కార్యక్రమాల పట్ల NCC నిబద్ధతను వెల్లడిస్తుందని మన్సుఖ్ మాండవీయా పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో త్రి-సర్వీసెస్ ఫ్యూచర్ వార్‌ఫేర్ కోర్సు–4 రేపటి నుంచి ప్రారంభం కానుంది. నాలుగు వారాల పాటు కొనసాగే ఈ కోర్సును హెడ్‌క్వార్టర్స్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ (HQ IDS) ఆధ్వర్యంలో, సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్ (CENJOWS) సమన్వయంతో నిర్వహిస్తున్నారు. భారత సైన్యంలోని మూడు దళాలకు చెందిన అధికారులు, ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, విద్యా, పరిశోధనా సంస్థలు, వ్యూహాత్మక అధ్యయన సంస్థల ప్రతినిధులు ఈ కోర్సులో పాల్గొంటారు. భవిష్యత్ యుద్ధ స్వరూపం, సాంకేతిక పరిణామాలు, జాతీయ భద్రతకు సంబంధించిన సవాళ్లపై సమగ్ర అవగాహన కల్పించడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యం. కోర్సులో భౌగోళిక-రాజకీయ పరిణామాలు, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), క్వాంటం సాంకేతికతలు, సైబర్ వార్‌ఫేర్, కాగ్నిటివ్ వార్‌ఫేర్, సమాచార యుద్ధం (ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్), సాంకేతికత ఆధారిత యుద్ధ వ్యూహాలు తదితర అంశాలపై నిపుణులు ఉపన్యాసాలు, చర్చలు నిర్వహిస్తారు. అలాగే, సాయుధ దళాల భవిష్యత్ కార్యాచరణ అవసరాలను స్వదేశీ రక్షణ పరిశ్రమ సామర్థ్యాలతో అనుసంధానించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ సంవత్సరం జూలై నెలలో దేశంలో బొగ్గు ఉత్పత్తి గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 7.51 శాతం వృద్ధిని నమోదు చేసిందని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఈ సంవత్సరం జూలై నెలలో దేశంలో మొత్తం బొగ్గు ఉత్పత్తి 69.75 మిలియన్ టన్నులకు చేరుకుందని పేర్కొంది. అలాగే.. బొగ్గు సరఫరాలో కూడా గణనీయమైన వృద్ధి కనిపించిందని.. గత ఏడాది జూలైలో 73.57 మిలియన్ టన్నులుగా ఉన్న సరఫరా, ఈ సంవత్సరం జూలైలో 17.34 శాతం వృద్ధితో 86.33 మిలియన్ టన్నులకు పెరిగిందని వివరించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు మొత్తం బొగ్గు ఉత్పత్తి, సరఫరా గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 5.87 శాతం వృద్ధిని సూచిస్తుందని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 2 రోజులలో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, చండీఘర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =